కథానిక

# కోరుకోనని అయస్కాంతం

కె. రామలక్ష్మి

ఎన్నో రోజులనుంచి ఒకటే మథన. బుర్ర ఏమేమిటో ఆలోచించేస్తుంది. ఆలోచనల బరువుతో ఒక్క తలే కాదు-శరీరం యావత్తూ ఆయాసపడుతోంది. అయినా ఏ దారీ తోచదు. రాధ ఆలోచించుకుంటూకూర్చుండగానే వచ్చాడు కృష్ణమూర్తి – అతన్ని చూడగానే మెరుపులా మెరిసి వూహాలరూపులు స్వచ్ఛంగా కనిపించాయి. ఇన్నాళ్ళుగా బుర్ర పాడుచేసుకొని ఆలోచిస్తున్నది యిలాంటి - యీ కృష్ణమూర్తి లాంటి వ్యక్తులను గురించే. కృష్ణమూర్తి ఒక వింతవ్యక్తి. అందరి దృష్టికీ అతను దారం తెగిన గాలిపటం, ఎంత తోస్తే అంతా చేసే ఘనుడు. ఆడవాళ్ళ జీవితాలతో చెలగాటాలాడే రసికుడు. సంఘం (?) కూసే కూతలకి అసలు లెక్కచేయని ధీరుడు. "ఎవరేమనుకుంటే నాకేం? యీ జీవితం ఎందుకంటావు? ఆనందించడంకోసం కదూ?" అని ఎదురు ప్రశ్న వేసే, అసలు ప్రశ్న వేయకుండానే ప్రశ్న వేసే ధోరణి అతనిది.

రాధ అన్నయ్యకీ, కృష్ణమూర్తికీ యెంతో స్నేహం. అందుకే కృష్ణమూర్తి కొన్నాళ్ళకి ఆ యింట్లో ఒకడై పోయాడు. తన మనస్సుని బాధించేవీ, అన్యులకి చెప్పలేనివీ, అర్థం వున్నవీ లేనివీ అన్నీ అన్నయ్యతో రాధతో మొహమాటం లేకుండా చెప్పేవాడు. రాధకి ఆశ్చర్యంవేసేది ఒకొక్కప్పుడు. ఏమిటీ వ్యక్తి? ఆలోచనలతోటీ తీరని వ్యథలతోటీ మానసికంగా చాలా బాధ పడుతున్నాడనిపించేది. కాని తీరా మాట్లాడిస్తే ఏ చీకూచింతా లేనివాడిలా, అలా అడిగినందుకు హేళనచేస్తూ సమాధానం చెప్పేవాడు. అలాంటి కృష్ణమూర్తి, ఆమాంతంగా మిలటరీలో చేర నిశ్చయించుకున్నాడనీ, ఎలాగేనా మాన్పించమనీ వాళ్ళమ్మ అన్నయ్యకి ఉత్తరం వ్రాయించింది. అన్నయ్య చెపితే కృష్ణమూర్తి వింటాడా? రాధ చెపితే వింటాడా? అందరినీ కాదని మిలటరీలో చేరనూ చేరాడు. ఉన్న వూరువదిలి బెంగుళూరు వెళ్ళనూ వెళ్ళాడు.

అతను బెంగుళూరు వెళ్ళిపోయాక ఎప్పుడో ఒకసారి సుడిగాలిలావచ్చి వెళ్ళేవాడు. "ఏరా రామం నువ్వు బెంగుళూరు వచ్చెయి. మిమ్మల్ని చూడ్డంకోసం పది పదిహేనురోజుల కోసారి యీ వూరు రావలసివస్తూంది." అంటూ రాధని చూచి చిలిపిగా నవ్వేవాడు. "అంతబాధగా వుంటే రావడం మానెయ్. మీ అమ్మకే యిష్టం లేనిపని చేయగాలేనిది, నీకేయిష్టం లేనిపని చేయడం ఎందుకూ?" అంటే "ఊరుకో రాధా, వాడికి నేనంటే అంత యిష్టం కనక అలా బాధ పడతాడు" అంటూ అన్నయ్య సమర్థించేవాడు. కాని ఆమాటే రాధకి అనుమానం వేసేది. "ఇతను ఎవరికోసం వస్తున్నట్టు? ఇన్నాళ్ళనుంచి నన్ను రాధారాధా అంటూ తిరుగుతున్నాడే, నాగురించి ఒక్కక్షణమేనా ఎప్పుడేనా ఆలోచిస్తాడా?"– అని ప్రశ్నించుకుంటే సమాధానం దొరికేది కాదు కాని, అతని చిలిపికళ్ళుమటుకు వెంటాడడం గుర్తుకొచ్చేది రాధకి. కాని ఎలాగ? నిజమే- కృష్ణమూర్తి అంటే రాధకి యిష్టమే. కాని అలాంటివాడిని పెళ్ళిచేసుకోవడం పిచ్చి. గాలి మార్పునిపట్టి మారే మనిషిని ప్రేమించడం ఏమిటి? తనకీ తనే బుద్ధి చెప్పుకొనేది. కాని, ఏ మహానుభావుడన్నాడో కాని, ఆడవాళ్ళు ఉత్తి ఎందుకూ పనికిరానివాళ్ళనే ప్రేమిస్తారు. లేకుంటే యీ దౌర్బల్యం ఏమిటి? కృష్ణమూర్తి వివిధప్రేమ కలాపాలు కళ్ళారా చూసింది. అతనినోటంటే వింది. అయినా ... కూడా, ఎందుకో అతనంటే ఆమెకిష్టం...

కష్ణమూర్తికేం? ఆస్తి బాగావుంది. బాగా చదువుకొన్నాడు. తల్లికి ఒక్కడే కొడుకు.

అందుకే కాబోలు-కొడుకుని అదుపాజ్ఞలలో పెట్టుకోలేకపోయింది! ఎంత తోస్తే అంత చేసేస్తాడు...అతని స్నేహితబృందానికి అంతులేదు. ...అతనే చెప్తాడు, ఎందరాడవాళ్ళు అతన్ని చూసి సమ్మోహితులై, తనవెంట వచ్చేస్తామన్నారో: అందుకే రాధ ఆలోచన అంతా. నిజంగా యిలాంటి వ్యక్తిని పెండ్లాడుదాం అనుకోవడం పిచ్చి. కాని రాధకి ఎందుకో అతనంటే యిష్టం... కృష్ణమూర్తి ద్వంద్వ వ్యక్తిత్వాన్ని కొంతలోకొంత అర్థంచేసుకొంది... అతనెంత తేలిగ్గా వ్యవహరిస్తాడో అంత లోతుహృదయం అని గ్రహించింది. ఎదుటి హృదయాలను గాయపరుస్తున్నానని తెలుసుకోలేడుగాని, తన హృదయాన్ని నిర్మలంగా ఉంచుకుంటాడు. అందుకే అందరూ అలా అనుకుంటారు అతన్ని గురించి. కొన్ని వేళల్లో అతని మనోభారాన్ని అతని చిలిపి కళ్లు వ్యక్తంచేస్తూనే వుంటాయి. అలాంటి సమయాల్లో ఎవరేనా పలకరిస్తే పెద్ద తత్వవేత్తలా మాట్లాడుతాడు. అప్పుడే రాధ అనుకొనేది: 'నాతోనైనా చెప్పకూడదా ఆహృదయభారాన్ని' అని. ఆ రోజు రావాలనీ, కృష్ణమూర్తి తనవాడై పోయి, ఎప్పుడూ హాయిగా నవ్వుతూ వుండాలనీ కోరేది....అంత గంభీరుడు-అంత వెర్రివాడు... అందుకే కృష్ణమూర్తిని ఎన్నేళ్ళనుంచీ ఎరుగుండీ పెళ్ళిచేసుకోడానికి ధైర్యంరాలేదు. అతన్ని అసహ్యించుకొనే ఆత్మబలం రాలేదు. అందుకే రాధకి కృష్ణమూర్తి అంటే అంత యిష్టం...

కృష్ణమూర్తి ఓవారం సెలవుపెట్టి ఈ యింటికి వచ్చాడు. అతన్ని చూడగానే తెలుస్తూంది ఏదో బాధపడుతున్నాడని: అవునుమరి. ఎంత వయస్సొచ్చినా, మాతృవియోగం అలా బాధపెడుతుంది. పిచ్చికృష్ణ! ఎంత బాధపెట్టాడు ఆవిడ బతికున్నప్పుడు? ఇతను మిలటరీలో చేరడమే ఆవిడ మంచంపట్టడానికి కారణం. యిప్పుడు ఆవిడ చనిపోయిందని బాధపడ్డం దేనికి? "ఏం వారం సెలవుపెట్టావుట! అన్నిరోజులు యిక్కడ వుండగలవూ?"అని అడిగింది. కాని అలా అడిగినందుకు నిజంగా బాధపడింది. "ఏమిటోలా అనిపించి వారంరోజులు సెలవుపెట్టి యిక్కడికి వచ్చాను. నన్నన్నాళ్లు భరించలేకపోతే, రేపే వెళ్ళిపోతాను"అన్నాడు కృష్ణమూర్తి. "ఛా, అంతట్లోనే ఉడుక్కుంటావనుకోలేదు కృష్ణమూర్తీ" అని అక్కడ వుండకుండా వెళ్ళిపోయింది. ఆ రోజే తేలింది: కృష్ణమూర్తికి మనశ్శాంతి కావాలంటే, ఈ పంచకి వస్తూవుంటాడు. అతనికి మనశ్శాంతి యిచ్చేది-రాధే. రాధది అహం అంటారేమో! అవును అహమే! ఎవరికుండదా అహం? సుడిగాలిని అరికట్టే శక్తి వుందంటే, గర్వంగా వుండదూ? ఎక్కడెక్కడ ఎలా తిరిగినా తల్లి పంచచేరే కొడుకంటే తల్లికి ప్రశాంతంగా వుండదూ?...

పొద్దుటినుంచీ ఒకటే హడావిడి. ఇంటికి పెద్ద రాధేగామరి. అమ్మ ఎప్పుడో వదిలింది రాధనీ, అన్నయ్యనీని. నాన్నగారు ఒకసంవత్సరంక్రితమే కన్నుమూశారు. ఇక ఎటొచ్చీ రాధా అన్నయ్యా మిగిలారు. అన్నయ్యకి అప్పుడప్పుడు తోస్తూ వుంటుంది—స్నేహితులందరినీ తీసుకువచ్చి—హాయిగా సాయంకాలమంతా అల్లరితో గడిపేయాలని. అదే కృష్ణమూర్తి పరిభాషలో "గాలా." కృష్ణమూర్తికూడా ఎలాగా వున్నాడు: యింకేం అల్లరికీ, ఆనందానికీ లోటులేదు. వంటయింట్లో మునిగిపోయింది రాధ. ఇలాంటి అవస్థవచ్చినప్పుడే అనుకొనేది-ఈగొడవంతా ఏమిటి? పెళ్లయివుంటే హాయిగా అత్తవారింట్లో వుండేదాన్ని కదా! అని. కాని అప్పుడే మళ్ళీ అనిపించేది-ఇక్కడ అన్నయ్యకి ఎవరు? అని. ఆలోచనలతో, వంటయింట్లో ఏదేదో చేస్తూవుండే, హడావిడిగా వచ్చాడు అన్నయ్య "ఒసేరాధా మాట"అంటూ.

"ఏరా, ఏములిగిందేమిటి అలా హడావిడి పడిపోతున్నావు?" అంది రాధ.

"చూడు రాధా నీ స్నేహితురాళ్లని కూడా పిలవకూడదూ? సరదాగా వుంటుంది!"

"బాగుంది రా, యిదేం నైట్‌క్లబ్ అనుకున్నావేమిటి ... అబ్బాయిలూ, అమ్మాయిలూ గోలా..."

"అమ్మమ్మలా మాట్లాడతావేం రాధా!" అంటుంటే వెనుకనుంచి "ఒరే రామం! ఇక్కడ నేనున్నానని, తన స్నేహితురాళ్ళని తీసుకురాడానికి జంకుతోందిరా మీ రాధ. ఔనా రాధా.. భయపడకులే, నే నివాళే వెళ్లిపోదలచు

కున్నాను" చాలా సీరియస్‌గానే అన్నాడు కృష్ణమూర్తి.

"ఛఛ, అదేం కాదు కృష్ణమూర్తీ, ఆ మాట కొస్తే......రామారావూ, సుశీలా స్నేహితులు, మూర్తీ, కమలా స్నేహితులు అలాగే అన్నాయి స్నేహితులందరికీ నా స్నేహితురాళ్లు స్నేహితులే. ఎటొచ్చీ కన్యగాని కన్య పార్వతి ఒక్కతే" అంది రాధ.

"అంటే?" ప్రశ్నార్థకంగా చూశాడు కృష్ణమూర్తి.

"అంటేనా? పార్వతి పెళ్ళయి పిల్లలతల్లి, అయినా అందరు కన్యలకంటే హుషారుగా, వుంటుంది. ఆవిడ భర్త ఒక లాయరు" ఇంకా చెప్తూనేవున్నా కృష్ణమూర్తి అప్పుడే రాధ చెయ్యి పట్టుకుని బతిమాలుతున్నాడు నువ్వావిడని తప్పకుండా తీసుకురావాలని రాధా అంటూ,

"ముందర నువ్వా అన్నయ్యా అవతలకి నడవండి యిక్కడ వంట అవాలా? లేకంటే మీ స్నేహితులందరూ తినేదేమిటి?"

"వెళ్లిపోతాం కాని నువ్వు ఆ పార్వతిని తీసుకువస్తావా?" సరే అని తలవూపింది. స్నేహితులిద్దరూ అవతలకి నడిచారు. వంట మాట యెలావున్నా రాధ బుర్ర పాడయింది— "ఏమిటి కృష్ణమూర్తి-నాతోటే ఇలా మాట్లాడుతాడు?నిజంగా అతనికి తెలియదా నా కతనంటే ఎంత ఆపేక్షో?...తెలిసీ ఏంప్రయోజనం? ఉత్త నిలకడలేని మనిషి!" అనుకుంది.

ఎలాగో అన్నీ తయారుచేసి, రెండు గంటలకి బయలుదేరింది-స్నేహితులని పిలుచుకురావడానికి. ఎవరూ రావని అనరు - వాళ్ళకీ తనకీ కూడా తెలుసు కారణం. ఈ రోజు కాకపోతే మళ్ళీ ఎన్నాళ్ళకో కాని రామారావుని చూసే అవకాశం దొరక దనుకుంటుంది సుశీల, మూర్తిని చూసి చాలా రోజులైంది-అనుకుంటుంది కమల, రావని ఎలా అంటారూ? రాధకి తెలుసు పార్వతి కొంచం బెట్టుచేస్తుంది. అయినా ఆ పార్వతిని ఒప్పించడం కష్టం అవలేదు..."ఏం పార్వతీ రావేమో అనుకున్నాను"అంటూ ఎదురు వెళ్ళింది. అప్పుడే రిక్షా దిగుతున్న పార్వతికి. "ఆయన యింటికి వస్తారేమో యిక్కడ దింపమంటామని అనుకున్నానోయ్, ఎక్కడో పనుందట, రాత్రి దాకా రానని కబురు చేశారు. సరేఅని, ఇంటికి వెళ్ళేప్పుడు యిక్కడికి రమ్మని కబురుచేసి యిలా వచ్చాను" అంది పార్వతి.

"రా పార్వతీ, నీకోసం రాధ యిలా బెంగ పెట్టుకుపోయిందంటే నమ్ము"అంటూ అన్నయ్య వచ్చాడు.

"ఇదేమిటి అంతా వీధిలోనే వుండిపోయారు" అంటూ కృష్ణమూర్తి వచ్చాడు.

"చూడు కృష్ణమూర్తీ, యీమె పార్వతి... పార్వతీ, యితను కృష్ణమూర్తి, మా యింటి స్నేహితుడు" అంటూ పరిచయం చేసింది.

"నమస్కారమండీ, రాధ చెప్తూనే వుంటుంది మిమ్మల్ని గురించి. ఇన్నాళ్ళకి చూడగలిగాను!" అంటూ చేతులు జోడించింది పార్వతి. అలా చెప్పవద్దని మూస్తే మటుకు పార్వతి చెప్పనే చెప్పింది! కృష్ణమూర్తి చిన్ననవ్వు నవ్వాడు. చచ్చేంత సిగ్గుపడింది రాధ.

...సాయంత్రం ఎలాగడిచిపోయిందో ఎవరికీ తెలియదు. ఒకటే మాటలు. ఎక్కడినుంచి వస్తాయో, ఇవన్నీ. ఆ గుంపులో ఒంటరిది రాధే నేమో! అనిపించింది. అన్నయ్య పద్మతో తెగ మాట్లాడేస్తున్నాడు. కృష్ణమూర్తి సరే, ఆ యింట్లో రాధవున్న సంగతికూడా మరచిపోయాడు. పార్వతితో అతనంత చనువుగామాట్లాడుతూంటే, ఏదో బాధగా తోచింది రాధకి. పార్వతి భర్త త్వరగావస్తే బాగుండును అనిపించింది...

...ఆ వారంలోజులూ పార్వతి ఈ యింటికి వచ్చింది. ఆఖరిరోజనుకుంటా భర్తకూడా వచ్చాడు. లాయరుగా పెద్దవాడేగాని, పార్వతి భర్త చాలా చలాకీ అయినవాడు. అన్నయ్యా అతనూ చదరంగందగ్గిర కూర్చుంటే తెల్లారిపోతుంది...ఆ రాత్రి కృష్ణమూర్తి వెళ్ళిపోతాడు. అతను వెళ్లిపోతాడంటే రాధకి ఓ పక్క సంతోషం, ఓ పక్క విచారం. ఎలాగైతేనేం, ఆ రాత్రి అతన్ని రైలెక్కించడానికి అందరూ వెళ్ళారు. కృష్ణమూర్తి ముఖం చూస్తే జాలేసింది. యీ ప్రపంచంలో ఎక్కడా నా అన్నవాళ్లు

ఆ వారంలో అన్నయ్యా స్నేహితులూ కలిసి పెళ్లి అయిందనిపించారు. కృష్ణమూర్తికి జ్వరమూ లేదు. ఏంలేదు. శుభ్రంగా తిని తిరుగుతున్నాడు అదంతా నాటకం అని తెలిసాక మరీ కోపం వచ్చింది రాధకి. ఆరోజంతా అలాగే ఆలోచిస్తూ కూర్చుంది. ఎవరిని గురించీ కాదు, భర్తగా మారిన కృష్ణమూర్తిని గురించే...ఏమిటీ ఈమనిషి? యుగయుగాలుగా తనని కోరినప్పుడు అలా ఎందుకు ప్రవర్తించాడు? తనకళ్ళయెదుట పార్వతిని అలా సమ్మోహనపరచి తనని లెక్కేనా చెయ్యకుండా వారంరోజులు తిరిగాడే? నిజంగా తనని ప్రేమించినవాడైతే అలా చేసి వుంటాడా? రాగానే అడగడానికి నిశ్చయించుకొని కిటికీలో కూర్చుని చూస్తూంది. చిన్న చిన్న చినుకులు పడుతున్నాయి. కృష్ణమూర్తి గబగబా నడిచి వస్తున్నాడు. రాధ తలుపు తీసింది. చినుకులుపడి అతని జుట్టు గమ్మత్తుగా వుంది. ఆ మునిమాపు వెలుగులో అతని కళ్లు మెరుస్తున్నాయి. "ఏం రాధా అలా చూస్తున్నావు?" అన్నాడు తన భుజంమీద చెయ్యివేస్తూ. "ఏంలేదు వర్షంలో తడిస్తే మళ్ళీ జ్వరం వస్తుందా, అని ఆలోచిస్తూ, అలా నీకేసి చూస్తూ వుండిపోయాను" అంది రాధ. కోపం అంతా కరిగిపోయింది. అడుగుదామన్న విషయాలే మరిచిపోయింది. ఏమిటీ వ్యక్తిలో ఉన్న ఆకర్షణ!

"ఏం రాధా! యింకేం జ్వరం రాదులే, నడు లోపల కూర్చుందాం" ఇద్దరూ కూర్చున్నారన్న మాటే కాని యిద్దరిమధ్యా ఓ అగాధం వ్యాపించి వుంది.

"ఇంకా దేన్ని గురించి రాధా ఆలోచన?"

"నిన్ను గురించే."

"అవునులే, ఆలోచించవలసిందే. నే దారం తెగిన గాలిపటాన్ననీ, ఆడవాళ్ళ జీవితాలలో చలగాటం ఆడే రసికుడిననీ నీ నమ్మకం. యిప్పుడు నేను కాదనిచెప్పినా నమ్మవులే. కాని, ఒకటి మాత్రం నిజం రాధా! యీ జీవితంలో ఏ కల్మషం నన్నంటదు. నాకు ఆనందం కావాలి. అది అందుకుందుకు యిన్నాళ్లుపట్టింది. ఆలోపున అన్వేషణ తప్పేమిటి? లోకం దృష్టిలో నేను చెడ్డవాణ్ణే. కాని నా దృష్టిలో నేను పవిత్రుణ్ణే. నా సంగతి నాకు తెలుసు. అదే నీకూ తెలిస్తే— అంతే నాకు కావలసింది." తన చేయి అతనిచేతిలోకి తీసుకున్నాడు. ఒక్కుమ్మడిగా దుఃఖం పొంగిపొర్లింది రాధకి. "కమలా, విమలా, లలితా పార్వతీ- అందరితోటీ నువ్వు జరిపిన దేమిటి?" గట్టిగా ప్రశ్నించాలని! కాని "నిజంగా నన్ను ప్రేమించే పెండ్లిచేసుకున్నావా?" అని అడిగింది రాధ. "పిచ్చిదానా ఆమాత్రం నమ్మకంలేదూ నామీద!" అంటూ జాలిపడ్డాడు. నిజమే, నమ్మకం వుంది. కాని ఎందుకలా ప్రవర్తించేవాడో తెలుసుకోలేదు. ఏంచేస్తుంది? పెళ్ళికాని క్రితం ఎన్నాళ్ళు కృష్ణమూర్తిని అజ్ఞాతంగా ప్రేమించిందో- యిప్పుడూ అంతగానూను. కాని కృష్ణమూర్తి మారతాడా? అనేది ఎప్పటికీ అనుమానమే రాధకి.

---

శ్రీ తిరుపతి వెంకన్న సంస్థానము దొడ్డ సంస్థానము. 1363 ఫసలీలో శ్రీవారి ఆదాయము రు. 40,26,480లు. ఖర్చు 'మామూలు'ది రు. 26,66,011 లు. ఇందులో దేవాలయాలమీద పెట్టే రు. 6,79,875 లు నేగాక విద్యాలయాలకు రు. 4,86,193 లు ఖర్చు అయినది. లాభసాటి పెట్టుబళ్లమీద రు. 6,37,614 లు ఖర్చు అయినది. శ్రీవారి ఆదాయములో వడ్డి కాసులు, ఆపతి మ్రొక్కులు, నిలువుదోపులు నీలాల రుసుములు అమాంబాపతులు ఇమిడియున్నవి. హిందూ ప్రజాసామాన్యములో పాతుకొనిపోయిన 'వెంకన్న' యందలి భక్తివిశ్వాసములే ఈ ఆదాయమునకు మూలము.